క్లుప్తంగా

క్లస్టర్ సమావేశాలు ఉపయోగించుకోవాలి



శావల్యాపురం: స్థానిక ఎంపీపీ పాఠశాలల క్లస్టరు సమావేశాలు బుధవారం నిర్వహించారు. శావల్యాపురం క్లస్టర్ పరిధిలో జరిగిన సమావేశంలో ఎంఈవో మద్దికుంట సాంబశివరావు పాల్గొని మాట్లాడుతూ దీర్ఘకాలం నుంచి పాఠశాలకు రాకుండా ఉన్నా విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మండలంలోని మతుకుమల్లి క్లస్టర్ పరిధిలో జరిగిన సమావేశంలో ఎంఈవో-2 పుసులూరి లలిత కుమారి పాల్గొని మాట్లాడుతూ క్లస్టర్ సమావేశాలను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాల సాధన కోసం కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయుల కీలకపాత్ర పోషించాలన్నారు. క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు బొడ్డపాటి విజయలక్ష్మి, టి.కోటేశ్వరరావు, రిసోర్స్ పర్సన్లు బిల్లా రాజా రమేష్, మల్లిఖార్జునరావు, శ్రీనివాస రావులు పాల్గొన్నారు.

లెర్నింగ్ ఔట్‌కమ్స్‌తో విద్యార్థులను తీర్చిదిద్దండి

బొల్లాపల్లి : మండలంలో క్లస్టర్ సమావేశాలు ఆయా క్లస్టర్ కేంద్రాల్లోని పాఠశాలల్లో బుధవారం నిర్వహించారు. రావులాపురం, మేళ్ల వాగు, వెల్లటూరు, బండ్లమోటు జడ్పీహైస్కూల్లో క్లస్టర్ సమావేశాలు జరిగాయి. బండ్లమోటు, వెల్లటూరు జడ్పీ హైస్కూల్లో నిర్వహించిన సమావేశంలో ఎంఈవో -2 కె.పార్వతి హాజరై మాట్లాడుతూ లెర్నింగ్ ఔట్ కమ్స్‌లో భాగంగా విద్యార్థులను అభివృద్ధి చేయాలన్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లిష్ చదవడం, రాయడం, లెక్కలు సబ్జెక్ట్‌లో నాలుగు సామర్థ్యాల్లో విద్యార్థులు అభివృద్ధి చెందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఆయా కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలోని సమస్యల గురించి చర్చించడం జరిగిందని తెలిపారు. సబ్జెక్ట్‌ల వారీగా ఉపాధ్యాయులకు బోధనపై వీడియో ప్లేచేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఆయా క్లస్టర్ పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

తహసీల్దారు సురేష్



శావల్యాపురం: స్థానిక తహసీల్దారు కార్యాలయం ప్రాంగణంలో జిల్లా కలెక్టరు ఆదేశాలు మేరకు చలివేంద్రాన్ని ఇన్‌చార్జ్ తహసీల్దారు సభావత్ సురేష్ నాయక్ బుధవారం ప్రారంభించారు. ఆయనతో పాటు సర్వే అధికారి పేరి సోముల నాసరయ్య, ఆర్ఐ చంద్రబాబు, గుంటూరు సాంబశివరావు, వీఆర్వోలు ఉప్పులూరి చిన మంగయ్య పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి కోసం సమష్టి కృషి చేయాలి

ఎంపీపీ ఝాన్సీసాగర్



యడ్లపాడు: మండలంలోని గ్రామాల అభివృద్ధికి సంబంధిత సభ్యులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని ఎంపీపీ పిడతల ఝాన్సీసాగర్ పిలుపునిచ్చారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'గ్రామాల్లో ఎదురవుతున్న సమస్యలను సమర్థంగా పరిష్కరించాలంటే ప్రతి ఒక్కరూ సమయ పాలన పాటించి, నిర్ణయించిన సమయానికి సమావేశాలకు హాజరుకావాలన్నారు. లేని పక్షంలో సమస్యలు మరింత తీవ్రరూపం దాల్చే ప్రమాదం ఉందన్నారు. అనంతరం మండలంలోని వివిధశాఖల అధికారులు తమ శాఖల సేవలు, ప్రస్తుతం అమలవు తున్న పథకాలు, భవిష్యత్ కార్యక్రమాల వివరాలను సభ్యుల ముందుంచారు. సమావేశంలో తహసీల్దార్ జెట్టి విజయశ్రీ, ఎంపీడీవో వి.హేమలతాదేవి, పీఆ (పీఆర్డీ) షేక్ జాకీర్ హుస్సేన్, మండలపరిషత్ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

రీసర్వేకు సహకారం అవసరం

బొల్లాపల్లి: రీసర్వే నిర్వహిస్తున్న గ్రామాల్లో రైతుల సహకారం అవసరమని నరసరావుపేట ఆర్డీవో కె. మధులత తెలిపారు. బుధవారం మండలంలోని సరికొండపాలెం, వెల్లటూరు గ్రామాలను సందర్శించారు. సరికొండపాలెంలో రీసర్వే పరిశీలించి అనంతరం మాట్లాడుతూ రైతుల సహకారంతో రీసర్వేను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం వెల్లటూరు గ్రామంలో మంజూరైన పెట్రోల్ బంకు స్థలాన్ని పరిశీలించి రికార్డును తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఏపీ సుధాకర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చిలకలూరిపేటలో కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి విడదల రజిని



వినుకొండలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



వినుకొండ లో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే, పార్టీ నాయకులు, కార్యకర్తలు

ప్రజల కోసం పుట్టిన పార్టీ వైఎస్సార్ సీపీ

- వైఎస్సార్ ఆశయాల కొనసాగింపే లక్ష్యం
- మాజీ మంత్రి విడదల రజిని
- ఘనంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం

చిలకలూరిపేట: ప్రజల కోసం... ప్రజా సంక్షేమం కోసం పుట్టిన పార్టీ వైఎస్సార్ సీపీ అని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి విడదల రజిని చెప్పారు. పట్టణంలోని ఎన్ఆర్టీ రోడ్డులో ఉన్న ఆమె నివాస ప్రాంగణంలో బుధ వారం వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి పార్టీ నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విడదల రజిని మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలను కొనసాగించటమే లక్ష్యంగా తమ పార్టీ పని చేస్తున్నదని చెప్పారు. ప్రజల్లో ఎక్కడ ఆదరణ పెరుగుతుందో అనే అక్కసుతో అప్పట్లో కేంద్రంతో పాటు రాష్ట్రంలోనూ అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, టీడీపీతో కలసి జగనన్నను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందని గుర్తు చేశారు. ఎన్నో కుట్రలకు పాల్పడ్డారని తెలిపారు. జగనన్నను, పార్టీని చిదిమేయాలని అప్పటి ప్రభుత్వ పెద్దలు ప్రయత్నించారని, వారందరి ప్రయత్నాలను పటాపంచలు చేస్తూ జగనన్న ధైర్యంగా నిలబడ్డారని పేర్కొన్నారు. పార్టీని దినదినాభివృద్ధి చేసి తన పాలనా కాలంలో దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా సంక్షేమం, అభివృద్ధిని అందించారని గుర్తు చేశారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచటంతో పాటు, సుస్థిర ఆర్థికవృద్ధిని సాధించి చూపారని కొనియాడారు. వలంటీరు, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకు, ఇంటింటికీ ప్రభుత్వ సేవలను తీసుకొచ్చారని పేర్కొన్నారు. ఇందుకు విరుద్ధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అలవి కాని హామీలను అమలు చేస్తానని ప్రజలను వంచించి అధికారంలోకి వచ్చారని విమర్శించారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలకు మించి ఇస్తానని అబద్ధపు వాగ్దానాలు చేసి వాటిని పూర్తిగా తుంగలో తొక్కారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు మోసాలను ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు మండలాల అధ్యక్షులు గుత్తా యాములయ్య, మద్దూరి కోటిరెడ్డి, ఘంటా శంకరరావు, ఎంపీపీ దేవినేని శంకరరావు, మాజీ ఎంపీపీ మద్దూరి భాస్కర రెడ్డి, రాష్ట్ర ముస్లిం కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ దరియావలి, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కందుల శ్రీకాంత్, నాయకులు కొచ్చెర్ల కిషోర్, బండారు జయకుమార్, పందుల బుల్లెబ్బాయి, మంగు ఏడుకొండలు, బసెల శివరామకృష్ణ, కాట్రగడ్డ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వినుకొండలో...

వినుకొండ : స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కార్యాలయంలో భారీ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం విలేకరులతో బొల్లా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్ సీపీ నాయకులను, కార్యకర్తలను వేధించడమే పనిగా పెట్టుకున్నారని, పరిపాలన గాలికి వదిలేసి బడుగు, బలహీన వర్గాలపై అక్రమ కేసులు బనాయించడం, వేధించడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. ఎన్నికల తరువాత వినుకొండ రూరల్ మండలంలోని ఏనుగుపాలెం గ్రామంలో ఒక మహిళను హత్యాచారం చేసి మృతదేహాన్ని వాగులో తొక్కినప్పటికీ పోలీసులు ఇంతవరకు దర్యాప్తులో నిందితులను తేల్చలేదని విమర్శించారు. చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు నిందితులను కఠినంగా శిక్షిస్తామని చెప్పి నేటి వరకు పట్టించుకోలేదని అన్నారు. చిన్నచిన్న వాళ్ల మీద అక్రమ కేసులు బనాయించి వేధించడం తప్ప పోలీసులు కూడా ఇలాంటి కేసులు విచారణ చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని, ఎలాంటి ఇబ్బంది వచ్చినా ముందుండి ఎదుర్కొంటామని, అక్రమ కేసులకు భయపడేది లేదన్నారు. వైఎస్సార్ సీపీ పట్ల ఇప్పటికీ ప్రజాదరణ తగ్గలేదన్నారు. పార్టీ ఆశయాలకు అనుగుణంగా మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అవిశ్రాంతంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

హామీల పేరిట మోసం చేశారు

- విద్యార్థుల జీవితాలతో కూటమి నాయకులు చెలగాటమాడుతున్నారు
- మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు విమర్శ



యువత పోరు కార్యక్రమానికి తరలివెళ్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా, నాయకులు, యువత

వినుకొండ : కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. చదువుకునే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు రిలీజ్ చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా యువత పోరు కార్యక్రమానికి వినుకొండ నుంచి వేలాది మంది కార్యకర్తలతో నరసరావుపేట కలెక్టరేట్ కార్యాలయం వరకు ర్యాలీగా బయలుదేరి వెళ్లారు.

ఈ సందర్భంగా బొల్లా మాట్లాడుతూ ఎన్నికల్లో అలివిగాని హామీలిచ్చి ఏ ఒక్క హామీని కూడా అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను కూటమి సర్కారు మోసం చేసిందని దుయ్యబట్టారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతు భరోసా, అమ్మఒడి, మహిళలకు, ఉచిత బస్సు వంటి ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి సంవత్సరం కాలం అవుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదని, దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఫీజురీయింబర్స్‌మెంట్‌పై యువత పోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు పేదల పక్షాన పోరాటం చేస్తామన్నారు. ప్రజలకు మంచి జరగాలంటే సంక్షేమ పథకాలు అమలు కావాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తే తప్ప న్యాయం జరగదన్నారు. ప్రజల పక్షాన నిర్వహిస్తున్న కార్యక్రమాలకు పార్టీలకతీతంగా మద్దతు ప్రకటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐదు మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

పెండింగ్ గృహాలకు నిధుల మోక్షం

యడ్లపాడు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న గృహాల నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు అదనపు ఆర్థిక సహాయం ప్రకటించినట్లు హౌసింగ్ ఏఈ షేక్ గౌస్‌బాషా తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల కింద ఇళ్ల నిర్మాణం ప్రారంభించి, నిధుల కొరత వల్ల అర్ధాంతరంగా ఆగిపోయిన గృహాల యజమానులు మంచి ప్రయోజనం చేకూరుతుందన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్- రూరల్) పథకం ద్వారా ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, పీవీజీటీఎస్ (దుర్బర గిరిజన తెగల)కు రూ.లక్ష వరకు అదనపు నిధులు మంజూరు చేయనున్నారని వివరించారు. ప్రస్తుతం బేస్‌మట్టం దశలోనే ఆగిపోయినవి, స్లాబ్ దశలో నిలిచిపోయినవి, ప్లాస్టింగ్ వరకు రాని గృహాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా నిధులు విడుదల చేస్తున్నాయని తెలిపారు. ఇంటి నిర్మాణాలు మధ్యలో నిలిచిన గృహాలు మండలం పరిధిలో 750 ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరందరికీ లబ్ధి చేకూరుతుందని చెప్పారు. కావున ఆయా నిధులను సద్వినియోగం చేసుకొని, నిలిచిన తమ ఇళ్ల పనుల్ని పునఃప్రారంభించి పూర్తిచేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.

టిడ్కో గృహాల మార్గంలో భద్రత కల్పించరూ..

మున్సిపల్ కమిషనర్‌ను కోరిన ఎంసీపీఐయూ నాయకులు



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నరసరావుపేట: పట్టణం నుంచి చిలకలూరిపేట వెళ్లే మార్గంలోని టిడ్కో గృహాలకు వెళ్లే మార్గంలో ప్రజలు రాకపోకలు సాగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ఐక్య (ఎంసీపీఐయూ) నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావుకు కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. పల్నాడు జిల్లా కార్యదర్శి రెడ్ బాష మాట్లాడుతూ ఆ మార్గంలో టిడ్కో గృహాలు 1500, జగనన్న కాలనీ ఇల్లు 600, గుమస్తాల కాలనీ ఇళ్లు 50 నుంచి 60 వరకు ఉన్నాయన్నారు. ఈ రోడ్డు గుండా రాత్రి సమయంలో వెళ్లేందుకు వీధిలైట్లు లేకపోవడం వల్ల పాములు సంచరిస్తూ భయాందోళనలకు గురిచేస్తున్నాయన్నారు. అందువలన వెంటనే వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే కొంతమంది మందుబాబులు రాత్రిపూట రోడ్డుపైనే కూర్చొని మద్యం సేవిస్తూ రాకపోకలు సాగించే మహిళలు, పిల్లలు పట్ల అనుచితంగా ప్రవర్తిస్తుండటంతో వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. టిడ్కో గృహాల పక్కనే రైల్వే ట్రాక్ ఉండటం వల్ల తల్లిదండ్రులు లేని సమయంలో వారు పట్టాలవైపు ఆడుకునేందుకు వెళుతున్నారని, దీని వలన ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం మెండుగా ఉందన్నారు. అందువలన అటువైపున ప్రహరీ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ రోడ్డు పక్కన గతంలో మునిసిపాలిటీ వారు మొక్కలు నాటించినా వాటికి నీరుపోయకపోవటంతో అవి మొత్తం పూర్తిగా ఎండిపోయాయని అన్నారు. మళ్లీ మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యతలను తీసుకోవాలని సూచించారు. పట్టణ ఎంసీపీఐయూ కార్యదర్శి షేక్ మస్తాన్‌షరీఫ్, కార్మిక సంఘం నాయకులు షేక్ అలీమ్‌ఖాన్, యువజన సంఘం నాయకులు షేక్ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

పశువులకు సకాలంలో టీకాలు

- వ్యాధుల నివారణకు చర్యలు
- జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ కంచర్ల కాంతారావు

యడ్లపాడు: పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేయించడం ద్వారా వ్యాధులను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని పల్నాడు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ కంచర్ల కాంతారావు సూచించారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా జగ్గాపురం పశువైద్యశాల పరిధిలోని జాలాది గ్రామంలో బుధవారం టీకా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని డీఏహెచ్‌ఓ డాక్టర్ కంచర్ల కాంతారావు యడ్లపాడు ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ వై.రాధాకృష్ణతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో పాల్గొన్న డీఏహెచ్‌ఓ కాంతారావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గాలికుంటు వ్యాధి నిరోధక టీకా కార్యక్రమం మార్చి ఒకటి నుంచి 30వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేసుకోవాలి

నరసరావుపేట రూరల్: రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను ప్రతి రైతు నమోదు చేసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి తెలిపారు. మండలంలోని గురవాయపాలెం, పెట్లూరివారిపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డీడీఏ శివకుమారి, ఏడీఏ మస్తానమ్మ, ఏవో నరేంద్రబాబులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివకుమారి మాట్లాడుతూ ఆధార్‌కార్డు, పొలం పాసుపుస్తకం, ఆధార్‌కు లింక్ అయిన ఫోన్ తీసుకొని రైతు సేవా కేంద్రంలో రైతులు సంప్రదించాలని తెలిపారు. రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను రైతులు తప్పని సరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. హోమ్ కంపోస్టింగ్, కిచెన్ గార్డెనింగ్ ఉపయోగాలను రైతులకు తెలియజేశారు. అనంతరం క్షేత్రస్థాయిలో మిర్చి, శనగ, మొక్కజొన్న పంటలను పరిశీలించి రైతులకు సలహాలు అందజేశారు. కార్యక్రమంలో వీఏఏ షాహీర్, మల్లికార్జునరావులు పాల్గొన్నారు.

పీఎం ఆవాస్ యోజనకు దరఖాస్తులు స్వీకరణ

- హౌసింగ్ డీఈ ఎన్.శ్రీనివాసరావు
- 31 అర్జీలకు తుది గడువు
- ఒక్కో నివాస గృహానికి రూ. 2 లక్షల 50 వేల మంజూరు



మాట్లాడుతున్న డీఈ శ్రీనివాసరావు

శావల్యాపురం: కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సారథ్యంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో (2.0) అర్హత కల్గిన ఉన్న లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేస్తామని హౌసింగ్ డీఈ ఎన్.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో డీఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 3989 మంది లబ్ధిదారులకు సంబదించి ప్రతిపాదలను సచివాలయాల ద్వారా అన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు. శావల్యాపురం మండలం-722, నూజెండ్ల-396, ఈపూరు-1063,వినుకొండ-514, బొల్లాపల్లి -1294 మంది లబ్ధిదారుల సమగ్ర వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు. ఈనెల 31 లోగా నూతన దరఖాస్తులు ఆయా గ్రామసచివాలయాల్లోని ఇంజినీరింగ్ సహాయకులకు భార్యభర్తలు ఆధార్, బ్యాంకు ఖాతా, జాబ్ కార్డు, రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణ, ఆధాయ ధ్రువీకరణ, నివేశ స్థల ధ్రువీకరణ పత్రాలు అందజేయాలన్నారు. ఒక్కో లబ్ధిదారుడికి రూ. 2 లక్షల 50 వేలు నిర్మాణ దశలు ఆధారంగా బిల్లులు మంజూరు చేస్తామన్నారు. ఆయనతో పాటు హౌసింగ్ ఏఈ షేక్ ఇమామ్ రసూల్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

సచివాలయ ఏర్పాటుకు స్థల పరిశీలన

నాదెండ్ల: గణపవరంలో జాతీయ రహదారి పక్కనే నిరుపయోగంగా ఉన్న బస్‌షెల్టర్‌ను ప్రజా ప్రయోజనార్థం మూడో సచివాలయంగా వినియోగించుకోవాలని డీఆర్‌వో ఏకా మురళికి స్థానికులు అర్జీ అందించారు. ఈ మేరకు డీఆర్‌వో బుధవారం పంచాయతీ కార్యదర్శి మారుతీబాబు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు శిల్ప, బాషాతో కలిసి బస్టాప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మారుతీ బాబు మాట్లాడుతూ గణపవరంలో నాలుగు సచివాలయాలు ఉన్నాయని, మూడో సచివాలయం అద్దె భవనంలో నడుస్తున్నదని, బస్‌షెల్టర్‌లో సచివాలయంలో మార్పు చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు కెల్లంపల్లి అచ్చయ్య, కంచర్ల శ్రీనివాసరావు, గాలి బుచ్చయ్య, కాట్రు శ్రీనివాసరావు, కృష్ణారావు, శ్రీనివాసరావు, ధనలక్ష్మీ గ్రూపు ఎల్‌వో కె.జవహర్‌బాబు ఉన్నారు.

పరీక్షల కిట్ల వితరణ

యడ్లపాడు: స్థానిక జెడ్పీహైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు హాల్ టిక్కెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలు పోపూరి రాఘవయ్య, పి.శివ నాగేశ్వరరావు, పి.శ్రీనివాసరావు సంయుక్తంగా విద్యార్థులకు రూ.3 వేల విలువైన 8 రకాల పరీక్షా కిట్లను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం జి.విజయభారతి, సీనియర్ ఉపాధ్యాయురాలు జి.శివపార్వతి, ఎస్ఎంసీ చైర్మన్ పఠాన్ రిహానా, కమిటీ సభ్యులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్నదానానికి బియ్యం వితరణ

నాదెండ్ల: గుంటూరు-కర్నూలు రహదారి సాతులూరు వద్ద రెడ్డిపేరంటాలమ్మ తల్లి ఆలయ నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. ఈ నెల 17న ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించనున్నారు. సుమారు రూ.2 కోట్ల వ్యయంతో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. చారిత్రాత్మక ప్రాధాన్యత కలిగిన ఆలయ పునః ప్రతిష్టకు విద్యాదాత, గోల్కొండగ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందించారు. ప్రతిష్ట సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే సుమారు 30 వేల మందికి పైగా భక్తులకు అన్నదానం చేయనున్న నేపథ్యంలో రామిరెడ్డి రూ.60 వేల విలువైన పది క్వింటాళ్ల బియ్యాన్ని అందించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ వజ్జా వీరాంజనేయులు, సభ్యులు జంపని లక్ష్మీనారాయణ, వజ్జా రామారావు, కమ్మ సీతయ్య, వెంకటరావు, నర్రా శ్రీనివాసరావు, వెంకటసుబ్బారావు, శివారెడ్డి తదితరులు ఉన్నారు.

సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

చిలకలూరిపేట: బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్ల సబ్సిడీ రుణాల కోసం సంబంధిత వర్గాల వర్గాలు ఈ నెల 22 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు తెలిపారు. తెల్ల రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు కలిగి ఉండి 21 నుంచి 60 సంవత్సరాల లోపు వయసు, కుల ధృవీకరణ పత్రం కలిగి ఉండి, పాస్‌పోర్టు సైజు ఫొటోతో మీ-సేవా కేంద్రాల ద్వారా ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు.

జిల్లాలోనే ప్రథమస్థానంలో నిలవాలి

నాదెండ్ల: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు పోటీతత్వంతో మంచి ఫలితాలు సాధించి పాఠశాలను జిల్లాలోనే ప్రథమస్థానంలో నిలపాలని విద్యాదాత, గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి చెప్పారు. చిరుమామిళ్ళ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థులు ఫేర్‌వెల్ నిర్వహించారు. హెచ్ఎం సుందరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నడికట్టు రామిరెడ్డి మాట్లాడారు. అనంతరం పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు యన్నం శివారెడ్డి, శ్యామల వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల మెగా రుణమేళా

నరసరావుపేట: వినుకొండ రోడ్డులోని గ్రాండ్ నవయుగ హోటల్‌లోని సమావేశపు హాలులో బుధవారం భారతీయ స్టేట్ బ్యాంక్ ఇండియా(ఎస్‌బీఐ) ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మెగా రుణమేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. గుంటూరు పరిపాలన కార్యాలయ జనరల్ మేనేజర్ కృష్ణకుమార్‌ప్రభు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ హీరాలాల్ నాయక్, రీజినల్ మేనేజర్ రామకుమార్ హాజరై ప్రసంగించారు. సభకు చీఫ్‌మేనేజర్ బాలగణేష్ అధ్యక్షత వహించారు. స్వయం సహాయక సంఘాలకు రూ.12.39 కోట్ల రుణాలను మంజూరు చేసినట్లు బ్యాంకు అధికారులు తెలిపారు. రుణ చెక్కును అందజేశారు.

వేసవిలో తాగునీటి ఎద్దడిపై దృష్టి సారించండి

నాదెండ్ల: వేసవిలో గ్రామాల్లో మంచినీటి సరఫరాపై ఎలాంటి లోపాలు లేకుండా ప్రభుత్వ యంత్రాంగం దృష్టిసారించాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా ఫిషరీష్ అధికారి సంజీవరావు చెప్పారు. నాదెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ తలతోటి రాణి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు.

నేడు ఉపాధి హామీ ప్రజావేదిక

వినుకొండ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 13న మండల సోషల్ ఆడిట్ ప్రజావేదికను నిర్వహిస్తున్నట్లు ఏపీవో కట్టా నాగేశ్వరరావు తెలిపారు. మండల పరిధిలో జరిగిన ఉపాధి హామీ పనులపై చర్చించడం జరుగుతుందని తెలిపారు. ఉపాధి హామీ పనులపై జరిగిన సామాజిక తనిఖీ బృందం ఆడిట్‌పై వివరాలు తెలియజేయడం జరుగుతుందన్నారు.

తిమ్మాపురం ఈనాం భూములపై ఫాం-01 ప్రచురణ

నూజెండ్ల: మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన ఈనాం భూములపై ఫాం-01 విడుదల చేయడమైందని తహసీల్దారు ఆర్.రమేష్‌కుమార్ బుధవారం తెలిపారు. ఈనాం చట్టం ప్రకారం (రద్దు రైతు వారీగా మార్పటం) 1956 ప్రకారం ఫాం-01 ను నూజెండ్ల తహసీల్దారు కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, అయినవోలు పోలీసు స్టేషను, తిమ్మాపురం పంచాయతీలోని 1834 ఎకరాల ఈనాం భూములకు వారసుల సమగ్ర వివరాలు ప్రచురించామన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 27న లోపు తహసీల్దారు కార్యాలయంలో తగిన ఆధారాలతో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలన్నారు.

విద్యార్థులు సేవాభావం కలిగి ఉండాలి



స్కౌట్ విద్యార్థులతో ఉపాధ్యాయులు

శావల్యాపురం: స్కౌట్ అండ్ గైడ్ విద్యార్థులు సేవాభావం కల్గియుండాలని వృద్ధులకు అంధులకు ఆపదలో ఉన్న వారికి తమ సహాయ సహకారాలు అందించటానికి ముందుండాలని శావల్యాపురం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 39 మంది విద్యార్థులచే భారత స్కౌట్స్ అండ్‌గైడ్స్ ప్రారంభించారు. నాయకత్వ లక్షణాలు పెంపొందించటం, క్రియ క్రమశిక్షణ కల్గియుంటారన్నారు. భవిష్యత్‌లో స్కౌట్ అండ్ గైడ్స్ కార్యక్రమంలో పాల్గొన వారందరికీ పరీక్షల్లో ఉత్తీర్ణత అయిన వారందరికీ ధ్రువీకరణ పత్రాల ద్వారా ఉన్నతా చదువులు ఉద్యోగులల్లో ప్రాధాన్యత ఇస్తారన్నారు. విద్యార్థులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గైడు టీచర్ల ఎస్.హబీ, హలీమా, గురుబాబు, వసంతరావు, స్టాఫ్ సెక్రటరీ బెజవాడ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం అభివృద్ధిపై సభ్యుల చర్చ

శావల్యాపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అభివృద్ధి కమిటీ సమావేశం బుధవారం నిర్వహించినట్లు మండల ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్ అన్నారు. ఈసందర్భంగా ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రం అభివృద్ధిలో కమిటీ సభ్యులతో పాటు తనవంతు సహకారం అందిస్తామన్నారు. గతంలో ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి రూ.1 లక్ష 75 నిధులు ప్రభుత్వం మంజూరు చేయగా, ఈ నిధులతో ఆరోగ్య కేంద్రంలో చేయాల్సిన పనులు వైద్యశాల్లో పిచ్చి మొక్కలు తొలగించటం, తాత్కాలిక ఉద్యోగికి వేతనం, రోగులకు మంచినీరు, సీసీ కెమెరాలు ఏర్పాటు, ప్రహరీకు ఖాళీలు పూడ్చటం తీర్మానించటం జరిగినట్లు వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్ తెలిపారు.